# ఆమెదే పైచేయి

- ఓటింగ్‌లో మహిళలదే ఆధిక్యం
- 4,80,163 ఓటర్లకు 3,95,816 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు
- సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్‌లో మహిళలు...
- గజ్వేల్‌లో పురుషుల ఓటింగ్ అధికం
- జిల్లాలో పురుషులు 4,68,420 మందికి 3,92,014మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు

సిద్దిపేట. డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : శాసన సభ సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లే ఓటింగ్‌లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఓటింగ్ సరళిని బట్టి చూస్తే ఏ గ్రామంలో చూసిన మహిళా ఓటర్ల చైతన్యమే ఎక్కువగా కనిపించింది. జిల్లాలో మొత్తం 9,48,664 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 4,68,420, మహిళలు 4,80,163, ఇతరులు 81 మంది ఉన్నారు. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో మహిళలే అధిక సంఖ్యలో ఓటింగ్ వినియోగించుకోగా, గజ్వేల్ నియోజకవర్గంలో పురుషులు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. జిల్లాలో 4,80,163 మహిళా ఓటర్లు ఉండగా 3,95,816 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్దిపేటలో 1,18,317 మంది మహిళలు ఉండగా, వీరిలో 89,710మంది, దుబ్బాక నియోజకవర్గంలో 1,01,081 మంది ఉండగా 87,815మంది, హుస్నాబాద్ నియోజకవర్గంలో 1,22,412 మంది ఉండగా 1,03,100 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య కన్న పురుషులే ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గంలో మహిళలు 1,38,353 మంది ఉండగా 1,15,191 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 1,36,294 మంది ఉండగా 1,15,892 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాలుగు నియోజకవర్గాలకు మూడింట మహిళల ఓటింగ్ అధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

**జిల్లాలో 83.15 శాతం పోలింగ్ నమోదు**

జిల్లాలో 83.15శాతం పోలింగ్ నమోదైంది. సిద్దిపేట నియోజకవర్గంలో 76.33 శాతం. గజ్వేల్ నియోజకవర్గంలో 84.14 శాతం, దుబ్బాక నియోజకవర్గంలో 87.51 శాతం, హుస్నాబాద్ నియోజకవర్గంలో 84.64 శాతం నమోదైంది. అత్యధికంగా జిల్లాలో దుబ్బాక నియోజకవర్గంలో పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా సిద్దిపేట నియోజకవర్గంలో నమోదైంది.



| నియోజకవర్గం | 2018 ఎన్నికలు | 2023 ఎన్నికలు |
|---|---|---|
| సిద్దిపేట | 78.99శాతం | 76.33 శాతం |
| గజ్వేల్ | 88.63 శాతం | 84.14 శాతం |
| దుబ్బాక | 85.99 శాతం | 87.51 శాతం |
| హుస్నాబాద్ | 83.13 శాతం | 84.64 శాతం |
| | 84.14 శాతం | 83.15 |

**పోలింగ్ శాతం వివరాలు..**

2018 సార్వత్రిక ఎన్నికలకు 2023 ఎన్నికలకు చూసుకుంటే ఈ సారి ఓట్ల సంఖ్య కూడా పెరిగింది. దీంతో ఓటింగ్ శాతం బాగానే జరిగింది అని చెప్పాలి. 2018 ఎన్నికల్లో జిల్లాలో మొత్తం 8,55,454 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 4,29,949, పురుషులు 4,25,467, ఇతరులు 38 మంది ఉన్నారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను చూసుకుంటే మొత్తం 9,48,664 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 4,80,163 మంది, పురుషులు 4,68,420 మంది ఇతరులు 81 మంది ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో మొత్తం 93,210 ఓట్లు పెరిగాయి. శాసన సభ సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 83.15 పోలింగ్ శాతం నమోదైంది. గత 2018 సార్వత్రిక ఎన్నికల్లో 84.14 పోలింగ్ శాతం నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను పరిశీలిస్తే ఈ ఎన్నికల్లో 0.99 శాతం పోలింగ్ తగ్గింది. సిద్దిపేట నియోజకవర్గంలో (2018 ఎన్నికల్లో) గత 78.99 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ సారి ఎన్నికల్లో 76.33 శాతం నమోదైంది. గజ్వేల్ నియోజకవర్గంలో (2018 ఎన్నికల్లో) 88.63 శాతం పోలింగ్ కాగా, ఈ ఎన్నికల్లో 84.14 శాతం పోలింగ్ నమోదైంది. దుబ్బాక నియోజకవర్గంలో (2018 ఎన్నికల్లో) 85.99 శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 87.51 శాతం పోలింగ్ నమోదైంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో (2018 ఎన్నికల్లో) 83.13 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 84.64శాతం పోలింగ్ నమోదైంది.




అబ్జర్వర్ల సమక్షంలో దుబ్బాక నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

**2023 సార్వత్రిక ఎన్నికల్లో వారీగా పోలింగ్ శాతం వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు | (పోలైన ఓట్లు) పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|---|---|---|---|---|---|
| సిద్దిపేట | 1,15,346 | 1,18,317 | 70 | 2,33,733 | 88,673 | 89,710 | 37 | 1,78,420 | 76.33 |
| గజ్వేల్ | 1,36,294 | 1,38,353 | 07 | 2,74,645 | 1,15,892 | 1,15,191 | 00 | 2,31,083 | 84.14 |
| దుబ్బాక | 97,019 | 1,01,081 | – | 1,98,100 | 85,551 | 87,815 | – | 1,73,366 | 87.51 |
| హుస్నాబాద్ | 1,19,761 | 1,22,412 | 04 | 2,42,177 | 1,01,898 | 1,03,100 | 01 | 2,04,999 | 84.64 |
| మొత్తం | 4,68,420 | 4,80,163 | 81 | 9,48,664 | 3,92,014 | 3,95,816 | 38 | 7,87,868 | 84.14 |

## రేపు ఓట్ల లెక్కింపు

- సిద్దిపేట ఇందూర్ కళాశాలలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ కేంద్రాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలు భద్రం

సిద్దిపేట, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ నెల 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జిల్లాలోని 4 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగనున్నది. గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భారీ బందోబస్తుతో సిద్దిపేట కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలను భద్రపర్చారు. జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత, నాలుగు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జనరల్ అబ్జర్వర్లు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లను సీజ్ చేశారు. ఈ ప్రక్రియను వీడియోలు, ఫొటోల రూపంలో నిక్షిప్తం చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను అమర్చారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కోసం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసే పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. కౌంటింగ్‌లో పాల్గొనే ఉద్యోగులకు ఇప్పటికే మొదటి దశ శిక్షణ ఇచ్చారు. 3న ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. మొదటి అరగంటలో పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తారు. అనంతరం రౌండ్ల వారీగా కౌంటింగ్ చేపడుతారు. కౌంటింగ్ ఫలితాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా టీవీలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి నియోజకవర్గానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించనున్నారు. రౌండ్ల వారీగా ఫలితాలు వెలువడనున్నాయి. లెక్కింపు ప్రారంభమైన గంటన్నరలోనే ఫలితాలు పూర్తిస్థాయిలో వెలువడనున్నాయి. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ఆయా పార్టీల అభ్యర్థులకు ప్రత్యేకంగా పాసులను అందజేస్తున్నారు. కాగా ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ ఏర్పాట్లను చేయడంతోపాటు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద కేంద్ర బలగాల నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎం, వీవీ ప్యాట్ మిషన్లను తరలిస్తున్న అధికారులు, సిబ్బంది

# బీఆర్‌ఎస్‌దే గెలుపు



జనగామలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- జనగామలో గులాబీజెండా ఎగరడం ఖాయం
- నాకు నమ్మకం, విశ్వాసం ఉంది
- గౌరవప్రదంగా గెలువబోతున్నాం
- ఎవరికీ అనుమానం లేదు
- కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం దౌర్జన్యం
- భౌతిక దాడులపై ఈసీకి ఫిర్యాదు
- విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- హాజరైన ఎమ్మెల్యే రాజయ్య, జనగామ జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి

జనగామ, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): జనగామలో గులాబీ జెండా ఎగరబోతున్నదని, బీఆర్‌ఎస్ గెలుపు తథ్యమన్న నమ్మకం, విశ్వాసం తనకు ఉందని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ రోజు కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు దౌర్జన్యంతో గులాబీ గెలుపును అడ్డుకోవాలని ప్రయత్నించి పార్టీ కార్యకర్తపై భౌతిక దాడులకు పూనుకున్నారని ఆరోపించారు. తాడుబొంగురం లేని బీజేపీ అభ్యర్థిగా ఉన్న దశమంత్‌రెడ్డి చిన్నపిల్లల చేష్టలతో కృష్ణప్రసాద్ అనే కార్యకర్తను కొట్టడం, కాంగ్రెస్ అభ్యర్థి కుమారుడు రాకేశ్‌రెడ్డి దౌర్జన్యానికి దిగడం, సీపీఎంకు చెందిన బూడిద గోపి రౌడీ, గుండాలా ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పల్లా పేర్కొన్నారు. ఏదైనా అభ్యంతరం ఉంటే అధికారులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప దాడులకు దిగడం శోచనీయమని, దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎన్ని బేధాభిప్రాయాలున్నా పార్టీ లైన్‌కు కట్టుబడి 45 రోజులు నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పని చేసిన ఫలితంగానే జనగామలో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోబోతున్నారని స్పష్టం చేశారు. రాత్రనక, పగలక పార్టీ కోసం పని చేసిన శ్రేణులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా, ఇదే స్ఫూర్తితో పనిచేద్దాం అని అన్నారు. ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రచారం జరిగిందని, 131 గ్రామాలు, రెండు పట్టణాలు, 8 మం డల కేంద్రాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసేలా నాయకులు కష్టపడ్డారని, పట్టణంలో మేధావులు, న్యాయవాదులు, డాక్టర్లు, జర్నలిస్టులు అంతా తన వైపు ఏకపక్షంగా ఉన్నారన్నారు. చాలా గౌరవప్రదంగా బీఆర్‌ఎస్ పార్టీ గెలవబోతుందని, ఇందులో ఎవరికీ కించిత్ అనుమానం కూడా లేదని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఓటర్లను ప్రలోభ పెట్టాలని, దాడులు, దౌర్జన్యం, గూండాయిజం, రౌడీయిజంతో బెదిరించాలని చూసినా విచక్షణతో ఓటేశారని, అందుకే జనగామలో గెలుపు తథ్యమనే నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వం మీద టీచర్లు, ఉద్యోగులకు కొంత బేధ భావం ఉన్నప్పటికీ, నాకు చాలామంది సలహాలు, సూచనలు ఇచ్చారని, కార్యకర్తలు మాత్రం కాలికి బలపం కట్టుకొని పార్టీ కోసం పని చేశారన్నారు. ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని మరోసారి స్పష్టం చేశారు. ఇతర జిల్లాల నుంచి మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు వచ్చి తన కోసం పని చేశారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మద్దూరు ఎంపీపీ బద్దిపడుగు కృష్ణారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

**-సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత**

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1 : జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ సెంటర్‌తోపాటు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 6 నుంచి 4వ తేదీ ఉదయం 6 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నలుగురు కంటే ఎక్కువ మంది గుంపులు గుంపులుగా తిరగవద్దన్నారు. పార్టీ కండువాలు, జెండాలు ధరించవద్దని.. ప్లకార్డులు ప్రదర్శించవద్దన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్లు వాడరాదని.. ఉపన్యాసాలు ఇవ్వకూడదన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, పటాకులు కాల్చడం వంటివి నిర్వహించడం నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.